క్లుప్తంగా

జూన్ 1న హనుమాన్ జయంతి

మిర్యాలగూడ టౌన్ : హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదిన మిర్యాలగూడలో హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం జయంతి ఉత్సవాల ప్రచార కరపత్రాలను స్థానిక సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ.రవీందర్ గౌడ్, విష్ణువర్ధన్, హరి, రాము, శివ, రమేష్, జనార్ధన్, శ్రీకాంత్, ప్రసాద్, మణి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలపై విష ప్రచారం మానుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : ముస్లింలపై బీజేపీ చేస్తున్న విష ప్రచారం మానుకోని దేశానికి చేసిన మంచి పనులు చెప్పి ఓట్లు అడగాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంజాద్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలకు చెప్పుకోవడానికి మంచి పని లేకపోవడంతో మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మోదీ నియంతృత్వం నుంచి ప్రజలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం డీ.అయ్యూబ్, నాయకులు ఆఫస్ అలీ, ఖాజామొనొద్దీన్ తదితరులున్నారు.

ధాన్యం లారీ బోల్తా

డిండి : మండలంలోని గోనకోల్ సమీపంలో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ లారీ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 500 బస్తాల లోడ్ వెళ్తుండగా గోనకల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో సమాచారం తెలుసుకున్న పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ధాన్యాన్ని మరో లారీలోకి ఎత్తించి మిల్లుకు తరలించినట్లు తెలిపారు.

బీజేపీతోనే ప్రజా సంక్షేమ పథకాలు అమలు

త్రిపురారం : బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే ప్రజా సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేస్తున్నారని కంపాసాగర్ బీజేపీ బూత్ లెవల్ అధ్యక్షులు బొల్లం సైదయ్య, లింగయ్యలు అన్నారు. సోమవారం మండలంలోని కంపాసాగర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మిర్యాలగూడ టౌన్ : గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ డీపోలో రెండో విడత సిబ్బందికి ఆర్టీసీ వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. ఈనెల 10వ తేదీ వరకు డిపోకు చెందిన ఆర్టీసీ, ప్రైవేట్ డ్రైవర్లతో పాటు ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక సిబ్బందికి పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఎం బొల్లెద్దు పాల్ పేర్కొన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిపోకు చెందిన మొత్తం సిబ్బంది 450 మంది ఉన్నారని, వీరందరికి వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ కార్మికులు తదితరులున్నారు.

ఈదురు గాలుల బీభత్సం



కుంకుడుచెట్టుతండా సమీపంలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

పెద్దవూర : మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులతో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో పాటు విద్యుత్ స్తంభాలు సైతం కూలిపోయాయి. మండలంలోని చలకుర్తి–కుంకుడుచెట్టు తండా ప్రధాన రహదారిపై రోడ్డు వెంట ఉన్న చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు సైతం కూలిపోవడంతో విద్యుత్ తీగలు అన్ని రోడ్డుపై పడ్డాయి. రాత్రంతా ఆ రోడ్డుపై వెళ్లడానికి వీలులేకుండా పోయింది. సోమవారం ఉదయం రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ తీగలను తొలగించటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

పొలాలుగా చెరువు శిఖం భూమి

- కబ్జాకు గురవుతున్న రుద్రప్ప చెరువు
- 150 ఎకరాలకు పైగా ఆక్రమణ
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు
- పరిరక్షించాలని అధికారులకు వేడుకోలు



పొలాలుగా మార్చుతున్న రుద్రప్ప చెరువు శిఖం భూమి

మిర్యాలగూడ : మండలంలోని అతి పెద్ద చెరువుగా పేరొందిన రుద్రారం రుద్రప్ప చెరువు నేడు కనుమరగయ్యే పరిస్థితి నెలకొంది. సర్వే నెం.107లో సుమారు 311.10 ఎకరాల్లో చెరువు భూమి కబ్జాకు గురైందని, ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువు సమీపంలో ఉన్న పంట పొలాల రైతులు చెరువు భూమిని తమ పొలాల్లోకి కలుపుకోని కబ్జా చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులో నీళ్లు లేకపోవడంతో చెరువు సమీపంలో ఉన్న రైతులు చెరువు భూమిని చదును చేసి తమ పొలాల్లోకి కలుపుకోని ఆ భూమిని తమ ఆధీనంలోకి చేసుకుంటున్నారు. సీజన్‌లో ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకు చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోతుంది. ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో రుద్రప్ప చెరువు కనుమరగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. కబ్జా విషయంపై మత్స్యకార్మికులు ఇటీవల కాలంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం కబ్జా నుంచి కాపాడాలని కోరారు.

సాగు, తాగునీటికి ఇబ్బంది

ఈ చెరువు కింద రుద్రారం, లక్ష్మీపురం, కొత్తపేట, రాయినిపాలెం, ముల్కలకాల్వ, కేశవాపురం, జాలుబాయితండా, బాలాజీతండా, ఎర్రగానితండా గ్రామాలకు తాగునీరు అందిస్తుంది. దీనికి తోడు ఆయా గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు సాగునీరు అందించి జీవనాధారంగా మారింది. ప్రస్తుతం ఈ చెరువుల్లో నీళ్లు లేక వెలవెలబోతుంది. దాని ఫలితంగా ఆయా గ్రామాలకు, పంట పొలాలకు సాగు, తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెరువ కింద 319 మంది మత్స్యకార్మికులు సభ్యులుగా ఉన్నారు. ఈ సభ్యుల కుటుంబాలన్ని కూడా ఆ చెరువుపైనే జీవనాధారంగా ఉన్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో చెరువులో చేప పిల్లలు వేయగా భూగర్భజలాలు అడుగంటిపోవడం కారణంగా చెరువు ఎండిపోయి చేప పిల్లలన్ని చనిపోయాయి. దీంతో మత్స్య కార్మికులకు తమకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉపాధి లేక మత్స్య కార్మికులు కూలినాలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువు ఎండిపోవడంతో లీజును రద్దు చేయాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు.

చెరువును కాపాడాలి



రుద్రారంతోపాటు అనేక గ్రామాలకు సాగు, తాగునీరు అందించే రుద్రప్ప చెరువు నీళ్ల లేక వెలవెలబోతుంది. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం చెరువులో నీళ్ల లేకపోవడంతో దీన్నే అదనుగా భావించిన సమీప పంట పొలాల రైతులు చెరువు భూములను కబ్జా చేస్తున్నారు. కబ్జాల నుంచి చెరువును కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేశాం.

– అంగోతు మల్సూరు, చెరువు కమిటీ సభ్యులు

మత్స్య కార్మికులను ఆదుకోవాలి



రుద్రారం చెరువుపైఐ 319 కుటుంబాలు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం చెరువు ఎండిపోవడంతో చేప పిల్లలు కూడా చనిపోయాయి. చెరువు పని లేకపోవడంతో సమీప గ్రామాలకు కూలి పనులకు వెళ్తున్నాం. రోజురోజుకు చెరువు కబ్జా గురికావడంతో చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోతుంది. భవిష్యత్‌లో చెరువు కనిపించే పరిస్థితి లేదు. కావున కబ్జా నుంచి చెరువును కాపాడాలి. లీజును రద్దు చేసి మత్స్య కార్మికులను ఆదుకోవాలి.

– పాతకోటి వెంకటయ్య, చెరువు చైర్మన్

విచారణ చేపడుతాం

రుద్రప్ప చెరువు కబ్జా విషయంపై ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడం కారణంగా ఎన్నికలు పూర్తి కాగానే చెరువు కబ్జాపై పూర్తిగా విచారణ చేపడుతాం. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటాఇం. ఆక్రమణకు గురైన భూమిని, చెరువును కాపాడుతాం. కబ్జా చేసిన వారు ఎంతటివారిపై నైనా చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, తహసీల్దార్

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



జెండా ఆవిష్కరిస్తున్న పల్లా దేవేందర్‌రెడ్డి

కొండమల్లేపల్లి : కార్మికులకు అండగా ఏఐటీయూసీ పోరాడుతుందని ఆ సంఘం కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండమల్లేపల్లిలో సోమవారం ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కె.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఎ.ముత్యాలు, సురేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ముదిగొండ లక్ష్మయ్య, వస్కుల శ్రీనయ్య, భూతరాజు వెంకటయ్య, బెజవాడ రవి, అందుగుల శ్రీనయ్య, ఏసు, ఓర్సు నర్సింహా, ఎ.గిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించడమే సీపీఎం లక్ష్యం

త్రిపురారం : మతపరమైప రాజకీయాలు చేస్తున్న బీజేపీని గద్దె దింపాలన్నదే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ ఇద్దయ్య, కార్యదర్శి ద్రైద శ్రీను అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొప్పు వెంకన్న, ఈదయ్య, పల్లపు వెంకటయ్య, చందనబోయిన రామచంద్రు, నలగొండ నర్సిరెడ్డి, ఆయితగాని విష్ణుమూర్తి, ద్రైద హుస్సేనమ్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి

పెద్దవూర : కేంద్రంలో మతోన్మాది బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని శిర్సనగండ్ల గ్రామంలో సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లయ్య, లచ్చిరెడ్డి, వెంకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయం



మాట్లాడుతున్న పిట్టల బాలరాజు

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి నలగొండ జిల్లాలో రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని రాష్ట్ర కార్యదర్శి, నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి పిట్టల బాలరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ బీజేపీ ప్రభుత్వం పేదలపై ధరలు భారాలను మోపి నడ్డి విరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మేకల సాగర్ రెడ్డి, కేతిరెడ్డి శకుంతలరెడ్డి, ఉబ్బెపల్లి ప్రమీల, కొప్పుల బాలరాజు, పరమేశ్వరి, వేణుగోపాల్‌రెడ్డి, బాలు, ఇమ్రాన్, అశోక్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు, త్రిపురారంలో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్

నిడమనూరు: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం తెలిపారు. మంగళవారం ఉదయం 9.30గంటలకు నిడమనూరు ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

త్రిపురారం : మండల కేంద్రంలో నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి రోడ్డు షో ఉంటుందని సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ రోడ్‌షోకు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంచర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



మిర్యాలగూడ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి



వేములపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోగల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు గడపగడపకు తిరిగి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల ప్రచార కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జునచారి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దార్థ, పల్నాటి జానకిరెడ్డి, రెడబోతు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, రవినాయక్, కిరణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..


పార్లమెంట్ ఎన్నికల్లో కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. సోమవారం పట్టణంలోని సీతారాంపురం, ఎన్ఎస్పీ క్యాంపులో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, శ్రీనివాస్‌రెడ్డి, గిరి, నాగరాజు, దుర్గయ్య, శివ, అరుణ్, రవినాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సోమవారం మండల పరిధిలోని తుంగపాడు గ్రామంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సైదులు, మాజీ ఎంపీపీ జానయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేములపల్లి : నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ వేములపల్లిలో మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మశేఖర్ రెడ్డి, ద్రైద జాన్సన్, మట్టయ్య, శంకర్‌రెడ్డి, శ్రీను, కిశోర్, వినోద్, సుధీర్, విజయ్, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి



విద్యుదాఘాతంతో మృతిచెందిన పాడి గేదెలు

వేములపల్లి : విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం చింతరెడ్డి సైదిరెడ్డి, లేకిరెడ్డి మంగమ్మలకు చెందిన పాడి గేదెలు సోమవారం రోజుమాదిరిగానే మేతకు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాయి. రెండు పాడి గేదెలు మేత మేసుకుంటూ వెళ్తున్న క్రమంలో పొలం గట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన పాడి గేదెలు ఒక్కొక్కటి సుమారు రూ.40వేల వరకు ఉంటాయన్నారు. పాడిపై ఆధారపడి జీవించే తమకు ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సెల్‌టవర్ తొలగించాలని ఆందోళన

చండూరు : మండలంలోని ఉడతలపల్లిలో నూతనంగా సెల్‌టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులు ధర్నా చేశారు. కనగల్– మాల్ ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా కంప చెట్లు వేసి బైఠాయించారు. సెల్‌టవర్ నివాసాలకు సమీపంలో ఉన్నందున అనేక అనర్థాలు కలుగుతుయన్నారు. గంటకు పైగా రోడ్డుపై ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని వారికి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. నిర్వాహకులు సెల్‌టవర్ కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి మంగమ్మ ప్రసాద్, బొమ్మరగొని లక్ష్మయ్య, రాజు, శ్రీను, శ్రీశైలం, వెంకన్న, నరసింహ, రామచంద్రం, రాజు, పాల్గొన్నారు.

పచ్చదనం నిండుగా.. చల్లదనం మెండుగా



కన్నెకల్లు రైతు వేదిక ఆవరణలో చెట్ల నీడ

మాడుగులపల్లి : మండలంలోని కన్నెకల్లు గ్రామంలో రైతు వేదిక, పంచాయతీ కార్యాలయం అరెకరం పైగా స్థలంలో ఒకే ఆవరణ నిర్మించారు. పదేళ్ల క్రితం వీటి పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో అవి పెరిగి ప్రస్తుతం చల్లని నీడను ఇస్తున్నాయి. ఆవరణ మొత్తం నీడ అలుముకోవడంతో స్థానికులు, అటుగా వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు సేద తీరుతున్నారు. సంచార జాతి వారు ఇదే ఆవరణలో గుడారాలు ఏర్పాటు చేసుకొని నెలరోజులుగా ఆవాసం ఉంటున్నారు. మండలంలో నిత్యం 43 డిగ్రీలకుపైగా ఎండ దంచికొడుతున్నా.. ఇక్కడ నిండుగా నీడ ఉండి వాతావరణం చల్లగా మనసుకు హాయి గొలుపుతోంది.

ఐదేళ్లలో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

- మాజీ మంత్రి జానారెడ్డి



కొండమల్లేపల్లి : రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి , ఎమ్మెల్యే బాలునాయక్



పెద్దఅడిశర్లపల్లి : రోడ్ షోలో పాల్గొన్న జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వచ్చే ఐదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని పెండ్లిపాకల, నక్కలగండి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామం నుంచి కొండమల్లేపల్లి లోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఎంఏ.సిరాఖాన్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎంఏ.ఖైసర్‌ఖాన్, గంధం సురేష్, బూడిద మల్లేశ్ యాదవ్ ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తిచేసి నీళ్లు అందిస్తామని నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం స్టేజీ నుంచిగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో మంజూరి అయిన లిఫ్టులను త్వరితగతిన పూర్తి చేసి దేవరకొండను సస్యశ్యామలం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో దేవరకొండకు అన్యాయం

దేవరకొండ : గడిచిన పదేళ్లలో దేవరకొండకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.సోమవారం రాత్రి దేవరకొండ పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, గుత్తా అమిత్‌రెడ్డి, నారి ఐలయ్య, నర్సింహ, జాల నర్సింహారెడ్డి, జాన్‌యాదవ్, దేవేందర్‌నాయక్, శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



దేవరకొండ మున్సిపల్ వైస్ చైర్మన్‌కు కండువా కప్పుతున్న బాలునాయక్

దేశంలో అభివృద్ధి, సంక్షేమం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్‌అలీతో పాటు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలంపల్లి నర్సింహా, సిరాజ్ ఖాన్, నల్లగాసు జాన్‌యాదవ్, ఎండీ యూనుస్, పున్న వెంకటేష్, వడ్త్య దేవేందర్, శిరందాసు కృష్ణయ్య పాల్గొన్నారు.

సొంత గూటికి కౌన్సిలర్ దేవకమ్మఅయోధ్య



బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్ దేవకమ్మఅయోధ్య

మిర్యాలగూడ : ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పట్టణంలోని 37వ వార్డు కౌన్సిరల్ బల్లెం దేవకమ్మఅయోధ్య తిరిగి సోమవారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన కౌన్సిలర్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు



ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న డీఎస్పీ

పెద్దవూర : పార్లమెంట్ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని చలకుర్తి గ్రామంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 13న నిర్వహించనున్న పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియో గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ సీఐ భీషన్న, పెద్దవూర ఎస్ఐ పి.వీరబాబు, సిబ్బంది హరిలాల్, సైదిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

అంజిరెడ్డి జీవితం ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న విద్యాపీఠ్ సభ్యులు, తదితరులు

రామగిరి (నల్లగొండ): అంజిరెడ్డి జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం నల్లగొండలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన పిన్నింటి అంజిరెడ్డి సంస్మరణ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సరస్వతీ విద్యాపీఠమునకు సొంత వ్యవసాయ పొలం నుంచి ఐదు ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. రాములబండ గ్రామంలోని భూమిలో పాఠశాలను నిర్మించాలని ఆయన చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. సంస్మరణ సభలో విద్యాపీఠ్ సంఘటన కార్యదర్శి శ్రీనివాస్, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

స్తంభాలు వేశారు.. తీగలు మరిచారు



పెద్దవూరలో వేసిన విద్యుత్ స్తంభాలు

పెద్దవూర: మండల కేంద్రంలోని రెడ్డి కాలనీలో గత శాసనసభ ఎన్నికలకు ముందు పెద్దవూర–గర్నెకుంట రహదారి నుంచి ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం విద్యుత్ స్తంభాలు వేశారు. స్తంభాలు ఏర్పాటు చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యుత్ తీగలు వేయడం మర్చిపోయారు. దీంతో విద్యుత్ వినియోగదారులు చాలా దూరం నుంచి ఇళ్లలోకి తీగలను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను పొందాల్సి వస్తుంది. ప్రస్తుతం బలమైన ఈదురు గాలులు వీస్తుండటంతో చాలా దూరం నుంచి ఏర్పాటు చేసుకున్న కేబుల్ తీగలు తెగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి విద్యుత్ స్తంభాలకు తీగలను బిగించి విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.